జూన్‌లో సాధారణ బదిలీలు చేపట్టాలి

కలెక్టరేట్, మే 24 : పలు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుకులాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి జూన్ నెలలో సాధారణ బదిలీలు నిర్వహించాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల ఉద్యోగుల జాయింట్ యాక్షన్ ఫోరం జిల్లా కన్వీనర్ ఎండీ అర్షద్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని ముకరంపురలో గల ఆ సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా ఉద్యోగుల సమావేశంలో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న రెండు డీఏ బకాయిలు, ఆటో మెటిక్ అడ్వాన్స్‌మెంట్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు గురుకుల సొసైటీ కార్యదర్శులకు ఇప్పటికే వినతిపత్రాలు అందజేసినట్లు పేర్కొన్నారు. వేసవి సెలవుల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఈఎల్స్ మంజూరు చేయాలని, ఒప్పంద సిబ్బందికి నగదు భృతి చెల్లించడంతో పాటు పలు పోస్టుల నియామకం సత్వరమే పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు రాజ్‌మహ్మద్, ఇంతియాజ్, అరుణ్‌కుమార్, జ్వాల ముఖేష్, బైండ్ల రాములు, వర్దెల్లి రాఘవరావు, చెన్నబోయిన వీరమాధవరావు, రఘుపతి, ఎం.రాంకుమార్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

ఇక్రిశాట్ సందర్శనకు దేశీ డీలర్లు

ఇక్రిశాట్ ఆవరణలో అధికారులు, దేశీ డీలర్లు

తిమ్మాపూర్, మే 24: జిల్లా ఆత్మ, డీడీఏ ఎఫ్‌టీసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని పటాన్‌చెరులో గల ఇక్రిశాట్ సంస్థను దేశీ డీలర్లు శుక్రవారం సందర్శించారు. ఇక్రిశాట్‌లోని నీటి నిల్వ పద్ధతులు, వినూత్న పంటల సాగు గురించి అక్కడి సిబ్బంది డీలర్లకు వివరించారు. అలాగే సిద్దిపేట జిల్లా ములుగులోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ హార్టికల్చర్ యూనివర్సిటీని సందర్శించి, పూలు, పండ్ల తోటల సాగు, పెంపకం వివరాలు తెలుసుకున్నారు. పర్యటనలో దేశీ ఫెసిలిటేటర్ రామచంద్రరావు, ఏవో మమత, దేశీ డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా వైద్య సేవలందించాలి

- దవాఖానలో మందులకు కొరత లేకుండా చూసుకోవాలి
- కలెక్టర్ పమేలా సత్పతి
- హుజూరాబాద్ ప్రభుత్వ ప్రాంతీయ ఆరోగ్య కేంద్రం సందర్శన

హుజూరాబాద్ ప్రభుత్వ దవాఖానలో బాలింతతో మాట్లాడుతున్న కలెక్టర్

హుజూరాబాద్ రూరల్, మే 24: ప్రైవేట్ హాస్పిటల్స్‌కు దీటుగా ప్రభుత్వ దవాఖానల్లో వైద్యాధికారులు, సిబ్బంది సేవలందించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. శుక్రవారం హుజూరాబాద్ ప్రభుత్వ ప్రాంతీయ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రతి వార్డుతో పాటు డయాలసిస్ కేంద్రం, ఆపరేషన్ థియేటర్, మందులు నిల్వ ఉంచే గది, మెటర్నిటీ వార్డు, లేబర్ రూమ్‌తో పాటు పలు వార్డుల్లో కలియతిరుగుతూ పరిశీలించారు. దాదాపు రెండు గంటల పాటు వైద్య సేవలను పర్యవేక్షించారు. దవాఖానకు వచ్చిన రోగులతో పాటు బాలింతలు, గర్భిణులతో మాట్లాడారు. డాక్టర్లు, సిబ్బంది అందిస్తున్న సేవలపై వారి అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలకు సంబంధించి వైద్యాధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రాంతీయ ఆరోగ్య కేంద్రంలో రోగులకు మెరుగైన సేవలందించాలని సూచించారు. ప్రైవేట్ హాస్పిటళ్ల కంటే ప్రభుత్వ దవాఖానల్లో ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నదని పేర్కొన్నారు. అత్యుత్తమ సేవలతోనే ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం కలుగుతుందని చెప్పారు. సాధారణ ప్రసవాలు పెరిగేలా కృషి చేయాలని సూచించారు. రోగులకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలందించాలని పేర్కొన్నారు. మందులకు కొరత లేకుండా చూసుకోవాలని, ఎమర్జెన్సీ మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఇంకా అదనంగా వైద్య సిబ్బందిని నియమించేందుకు కృషి చేస్తామన్నారు. నిరంతరం విద్యుత్ ఉండేలా చూసుకోవాలని, రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పర్యవేక్షించాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. దవాఖానకు సంబంధించిన ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి నేరుగా తీసుకురావాలని వైద్యాధికారులకు సూచించారు. వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం హుజూరాబాద్ మండలం రాజపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను కలెక్టర్ పరిశీలించారు. వాటికి సంబంధించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి పలు సూచనలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో హుజూరాబాద్ తహసీల్దార్ విజయకుమార్, ఎంపీడీవో సునీత, డిప్యూటీ డీఎంహెచ్‌వో బీ చందు, ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ రాజేందర్ రెడ్డి, వైద్యులు శ్రీకాంత్ రెడ్డి, వాణీలత, సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

యూనిఫామ్స్ మన్నికగా ఉండాలి

మానకొండూర్, మే 24: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే యూనిఫామ్స్ సంవత్సరం పాటు ధరించేలా మన్నికగా ఉండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మానకొండూర్ మండల కేంద్రంలో రుద్రమ మండల సమాఖ్య ఆధ్వర్యంలో నడుస్తున్న మహిళా శక్తి కుట్టుశిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్వశక్తి మహిళలు కుడుతున్న యూనిఫామ్స్‌ను పరిశీలించి వారితో మాట్లాడారు. సంవత్సర కాలం విద్యార్థులు ధరించేలా డబుల్ స్టిచ్చింగ్‌తో యూనిఫామ్స్ మన్నికగా ఉండాలని సూచించారు. క్లాత్ తీసుకువచ్చేందుకు అయ్యే రవాణా ఖర్చులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం పీహెచ్‌సీని తనిఖీ చేశారు. పీహెచ్‌సీకి వచ్చే రోగులకు సరైన వైద్యసేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో శ్రీధర్, ఏపీఎంలు నిరంజన్, సంతోష్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలి: అదనపు కలెక్టర్

కార్పొరేషన్, మే 24 : నగరంలో పారిశుధ్య పనులను సక్రమంగా చేపట్టాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. శుక్రవారం నగరంలోని బోయవాడ, హౌసింగ్ బోర్డ్ కాలనీ, తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎక్కడా చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, పారిశుధ్య సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన నిరంతర సరఫరాకు చర్యలు: ఎస్ఈ

ముకరంపుర, మే 24: క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న విద్యుత్ అధికారులు, సిబ్బంది వినియోగదారులకు నాణ్యమైన నిరంతర సరఫరాకు కృషి చేయాలని ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ వీ గంగాధర్ అధికారులను ఆదేశించారు. కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం కరీంనగర్ సబ్ డివిజన్-1, 2 పరిధిలోని అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఎప్పటికప్పుడు లైన్లు, డీటీఆర్‌లను తనిఖీ చేస్తూ నాణ్యమైన సరఫరాను అందించాలని సూచించారు. లక్ష్యాలకు అనుగుణంగా రెవెన్యూ వసూళ్లను సాధించాలన్నారు. టౌన్ డీఈ రాజం, ఏడీఈలు నరేందర్, సుధీర్ కుమార్, ఏఏలు సత్యనారాయణ, సుల్తాన్ రవి, ఏఈలు, సబ్ ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ స్టేషన్లను తనిఖీ చేసిన సీజీఎం

ముకరంపుర, మే 24: ఎన్పీడీసీఎల్ సీజీఎం బీ అశోక్ కుమార్ శుక్రవారం కరీంనగర్‌లోని 33/11కేవీ బొమ్మకల్, రేకుర్తి, కొత్తపల్లి సబ్ స్టేషన్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ స్టేషన్ల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. బ్రేకర్లు, బ్యాటరీలు, ఎర్తింగ్, పీటీఆర్‌లు, ఏబీ స్విచ్‌ల పనితీరును పరిశీలించారు. సబ్ స్టేషన్‌లో ప్రతి పరికరాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన మరమ్మతులు చేస్తూ వినియోగదారులకు నాణ్యమైన నిరంతర సరఫరా అందించాలని ఆదేశించారు. టౌన్, ఎమ్మార్టీ డీఈలు రాజం, కాళిదాస్, ఏడీఈ కే రాజు, ఏఈలు తిరుపతి, శ్రీనివాస్, అశోక్, సిబ్బంది ఉన్నారు.

డీఎల్‌పీవో ఆకస్మిక తనిఖీ

చిగురుమామిడి, మే 24: మండలంలోని ఇందుర్తి, కొండాపూర్, ఉల్లంపల్లి గ్రామాల్లో ఈజీఎస్‌లో భాగంగా చేపట్టిన శ్మశాన వాటిక, నర్సరీ, పల్లె ప్రకృతి వనం, డంప్ యార్డ్ పనులను డీఎల్‌పీవో రాంబాబు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందుర్తిలో పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి ఇనుగాల వెంకటరమణారెడ్డిని అభినందించారు. ఆయన వెంట ఎంపీవో శ్రవణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు ఇనుగాల వెంకటరమణారెడ్డి, రాంకీ, అజయ్ తదితరులు ఉన్నారు.

మైనార్టీ గురుకులంలో ప్రవేశాలపై అవగాహన

కరీంనగర్ రూరల్, మే 24: మొగ్దుంపూర్‌లోని మైనార్టీ గురుకుల కళాశాల బాలుర-3లో 2024-25 విద్యా సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమోహన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కరీంనగర్‌లోని విజయనగర్ కాలనీలోని మసీద్ ఏహబీబ్ వద్ద ప్రవేశాలపై అవగాహన స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యాలయంలోని కోర్సులు, ఖాళీ సీట్ల వివరాలతో పాటు, మైనారిటీ గురుకులాలు అందిస్తున్న సదుపాయాలు, సాధించిన విజయాలను ప్రజలకు వివరించారు. కాగా, స్టాల్‌ను ఏర్పాటు చేయడంపై ప్రిన్సిపాల్ పోరండ్ల చంద్రమోహన్, ఉపాధ్యాయ బృందాన్ని కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఆర్ఎల్‌సీ సురేశ్ అభినందించారు. కార్యక్రమంలో మసీద్ ఇమామ్ మహ్మద్ ముజమ్మిల్‌తోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'దర్గా' కోశాధికారి మృతికి సంతాపం

జమ్మికుంట, మే 24: బిజిగిరిషరీఫ్ దర్గా కమిటీ కోశాధికారి ఎండీ మహమూద్(48) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందగా, దర్గా కమిటీ అధ్యక్షుడు ఎండీ ఇక్బాల్, కార్యవర్గ సభ్యులు, తదితరులు సంతాపం ప్రకటించారు. దర్గా కోసం మహమూద్, అతడి కుటుంబం అందించిన సేవలను కొనియాడారు. అతడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సహకార సేవలను సద్వినియోగం చేసుకోవాలి

విత్తనాలు పంపిణీ చేస్తున్న సింగిల్ విండో చైర్మన్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

సైదాపూర్, మే 24: రైతులు సహకార సంఘాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సింగిల్‌విండో చైర్మన్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త తిరుపతిరెడ్డి సూచించారు. శుక్రవారం మండలకేంద్రంలోని వెన్కేపల్లి-సైదాపూర్ సహకార సంఘం కార్యాలయంలో రైతులకు పచ్చిరొట్ట, వరివిత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. విత్తనాలు కావాల్సిన రైతులు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ మునిపాల రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

కళాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలి

చిగురుమామిడి, మే 24: రంగస్థల, సాంస్కృతిక కళాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలని తెలంగాణ రంగస్థల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వంగ సుధాకర్ కోరారు. నవాబుపేట్ గ్రామంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సంపూర్ణ జీవిత చరిత్ర నాటక ప్రదర్శన ముగింపు కార్యక్రమం శుక్రవారం జరుగగా, ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కళాకారులకు ప్రభుత్వం నెలవారీగా పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. ప్రదర్శన అనంతరం కళాకారులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మండల కళాకారుల కమిటీ అధ్యక్షుడు శ్రీ రామోజ్ రాజకుమార్, మానకొండూర్ మండలాధ్యక్షుడు పిట్టల సంపత్, తిమ్మాపూర్ మండలాధ్యక్షుడు పడాల శ్రీనివాస్‌తో పాటు కళాకారులు బాలయ్య, కొమురయ్య, కిషన్, మొగిలి, కుతుబుద్దీన్, శ్రీనివాస్, సంపత్, రాజు, రాజయ్య, సదానందం, రమేశ్, కుమారస్వామి, కొమురయ్య, సంపత్, వెంకటరెడ్డి, రమేశ్, నరేశ్, సుధాకర్, శ్రీనివాస్, కనకయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

శంకరపట్నం/చిగురుమామిడి/గంగాధర, మే 24: శంకరపట్నం మండలం ముత్తారం ఆగ్రోస్ కేంద్రంలో, చిగురుమామిడి, గంగాధర ఎక్స్ రోడ్డులోని డీసీఎంఎస్‌లలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఆయా మండలాల ఏవోలు ఆర్ శ్రీనివాస్, రంజిత్ కుమార్, రాజు శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. జీలుగ విత్తనాల 30 కిలోల బ్యాగు ధర రూ.1116 ఉంటుందని పేర్కొన్నారు. జీలుగ విత్తనాలు కావలసిన రైతులు ఆధార్ కార్డుతో పాటు పట్టాదార్ పాసు పుస్తకం తీసుకెళ్లి కొనుగోలు చేయవచ్చని తెలిపారు.

బైక్ దొంగ అరెస్ట్

రాంనగర్, మే 24 : నగరంలో ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఒకరిని వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి మూడు వాహనాలను రికవరీ చేశారు. కరీంనగర్ బైపాస్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఆదిలాబాద్ జిల్లా నేరేడుగొండ గ్రామానికి చెందిన ప్రస్తుతం వేములవాడలో ఉంటున్న భూక్యా కృష్ణ రాథోడ్ అనుమానాస్పదంగా కనిపించడంతో ఆపి ప్రశ్నించారు. వాహన ధ్రువీకరణ పత్రాలు అడుగగా, పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అదుపులోకి తీసుకొని విచారించారు. బైక్ దొంగతనాలు చేస్తూ వాటిని వేరోచోట అమ్ముతూ వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తున్నట్లు గుర్తించారు. కృష్ణ రాథోడ్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు. వన్‌టౌన్ ఎస్ఐ స్వామి, హెడ్ కానిస్టేబుల్ హసనొద్దీన్, కానిస్టేబుల్ బషీరొద్దీన్‌ను ఇన్‌స్పెక్టర్ సరిలాల్ అభినందించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
సంపాదించుకోవచ్చు
★మీ ఇంటి వద్ద ఉండి రోజుకు 2 గం|| చేతివ్రాత ద్వారా నెలకు 10 వే||ల నుండి 15 వే||ల వరకు సంపాదించుకోవచ్చు. పూర్తి వివరములకు కాల్ చేయండి. సెల్: 6304484084.
NTK-311319

CHANGE OF NAME
★మోతె చందు, తండ్రి సమ్మయ్య, గ్రామము కొత్తపల్లి అను నేను నా పేరును మోతె చంద్రశేఖర్‌గా తేది. 24-05-2024 రోజున మార్చుకొనుచున్నాను. ఇక మీదట మోతె చంద్రశేఖర్ గా కొనసాగించబడును.
NTK-0000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

వేంకటేశ్వరస్వామి జాతరకు హాజరైన ఎమ్మెల్యే

చొప్పదండి, మే 24: చాకుంట గ్రామంలో వేంకటేశ్వరస్వామి జాతర మహోత్సవాలకు శుక్రవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కాంగ్రెస్ శ్రేణులతో కలిసి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చొప్పదండి నియోజకవర్గం పంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

గంగాధర, మే 24 : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కిరణ్‌రెడ్డి సూచించారు. 'సరైన అవగాహనతోనే సైబర్ నేరాల నివారణ' అంశంపై ముద్రించిన గోడ ప్రతిని శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. ఆన్‌లైన్‌లో ఎవరినీ నమ్మవద్దని, సైబర్ మోసగాళ్ల చేతిలో చిక్కి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో జిల్లా యువజన అవార్డు గ్రహీత గజ్జెల అశోక్, నాయకులు ఆరెపల్లి రమేశ్, గజ్జెల రాజ్‌కుమార్, గడ్డం ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

5లోగా యూనిఫామ్స్ అందజేయాలి

శంకరపట్నం, మే 24: జూన్ 5వ తేదీలోగా స్కూల్ విద్యార్థుల యూనిఫామ్స్ అందజేయాలని డీఆర్‌డీవో శ్రీధర్ సెర్ప్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో మహిళా శక్తి స్కీం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూనిఫాం స్టిచ్చింగ్ సెంటర్‌ను సందర్శించి, ఏపీఎం, సీసీలకు పలు సూచనలిచ్చారు. అనంతరం కరీంపేట్‌లో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన ఎంఐ ట్యాంక్ పనులను పరిశీలించారు. కూలీలకు అవసరమైన అన్ని వసతులను కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో శ్రీవాణి, ఏపీవో శారద, ఏపీఎం సుధాకర్, టీఏలు అశోక్, మహేందర్, సతీశ్, సీసీలు సంపత్, రాజు, లక్ష్మీనారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్‌లు, తదితరులు పాల్గొన్నారు.

అవమానం జరిగిందని ఫిర్యాదు

శంకరపట్నం, మే 24: తమకు అవమానం జరిగిందని ఆరోపిస్తూ మండలంలోని కరీంపేట్ గ్రామానికి చెందిన పలువురు దళిత సంఘాల నాయకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 23న గ్రామంలోని రేణుకా ఎల్లమ్మ గుడికి మొక్కులు చెల్లించేందుకు వెళ్లగా అదే గ్రామానికి చెందిన ఓ కులానికి చెందిన పెద్ద మనుషులు తమను గుడిలోకి వెళ్లేందుకు తాళం తీయకుండా అవమానించారని ఆరోపించారు. ఈ మేరకు తహసీల్దార్ అనుపమ, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు దళిత సంఘాల నాయకులు తెలిపారు.

క్రీడా ప్రాంగణాల వద్ద విద్యుత్ లైటింగ్ అమర్చాలి

చిగురుమామిడి, మే 24: గ్రామీణ క్రీడా ప్రాంగణాల ఆవరణలో విద్యుత్ లైట్లను అమర్చి బయో ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) ఏ రవీందర్ ఆదేశించారు. శుక్రవారం చిగురుమామిడి గ్రామపంచాయతీతో పాటు నర్సరీ, పల్లె ప్రకృతి వనం, సెగ్రిగేషన్ షెడ్డు, వైకుంఠధామం, పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. గ్రామాల్లో పారిశుధ్యం, నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీవో పార్నంది శ్రవణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది ఉన్నారు.

హుజూరాబాద్ రూరల్: జై కిసాన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏసీపీ, సీఐలు

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

- క్రిమినల్, పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తాం
- హుజూరాబాద్ ఏసీపీ సీహెచ్ శ్రీనివాస్‌జీ.. షాపుల్లో తనిఖీలు

జమ్మికుంట, మే 24: నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసుల నమోదుతో పాటు పీడీ యాక్టు అమలు చేస్తామని హుజూరాబాద్ ఏసీపీ సీహెచ్ శ్రీనివాస్‌జీ హెచ్చరించారు. శుక్రవారం పట్టణ సీఐ వీ రవి, వ్యవసాయ శాఖాధికారులతో కలిసి ఆయన జమ్మికుంట పట్టణంలోని ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. షాపుల్లోని స్టాక్‌లను పరిశీలించారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ.. రైతులనెవరూ మోసం చేయవద్దని, అలాగే రైతులు కూడా నాణ్యమైన విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు సందర్భంగా తప్పని సరిగా డీలర్ వద్ద నుంచి బిల్లులు తీసుకోవాలని చెప్పారు. నేటి నుంచి అధికారులు గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. డీలర్లపై ఫిర్యాదులొస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్కడ పట్టణ సీఐ రవి, జమ్మికుంట ఏవో గోవర్ధన్‌రెడ్డితో పాటు ఇల్లందకుంట, వీణవంక ఎస్ఐలు, తదితరులున్నారు.

జై కిసాన్ పోస్టర్ ఆవిష్కరణ

హుజూరాబాద్ రూరల్, మే 24: విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పిస్తూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన జై కిసాన్ పోస్టర్‌ను హుజూరాబాద్ ఏసీపీ సీహెచ్ శ్రీనివాస్‌జీ శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు రైతుల దృష్టికి వస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో, వ్యవసాయ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సీఐలు బొల్లం రమేశ్, రవికుమార్, కిశోర్‌కుమార్, పులి వెంకట్, ఎస్ఐలు శ్రీశైలం, తిరుపతి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, మే 24: నగరంలో మరమ్మతులు చేపడుతున్నందున శనివారం ఉదయం 8.30నుంచి 11గంటల వరకు మహిళా డిగ్రీ కళాశాల, కశ్మీర్ గడ్డ, ముకరంపుర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని టౌన్-2 ఏడీఈ సుధీర్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ప్రశాంతంగా పాలిసెట్

కమాన్‌చౌరస్తా, మే 24 : జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అప్పారావు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా తొమ్మిది పరీక్ష కేంద్రాలు కేటాయించగా, మొత్తం 3766 మంది విద్యార్థులకు గానూ 3428 మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. 338 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వెల్లడించారు.

ఎలగందుల మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

కొత్తపల్లి, మే 24 : నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) ఫలితాల్లో మండలంలోని ఎలగందుల మోడల్ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ వీ సరిత పేర్కొన్నారు. డిసెంబర్ 10న నిర్వహించిన ఈ పరీక్షలో మోడల్ స్కూల్‌కు చెందిన 12 మంది విద్యార్థులు ఎంపికై పాఠశాలను జిల్లాస్థాయిలో మొదటిస్థానంలో నిలిపారన్నారు. విద్యార్థులను డీఈవో, ఎంఈవో, ప్రిన్సిపాల్ అభినందించారు.

మేలైన విత్తనంతోనే నాణ్యమైన దిగుబడి

- వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త మంజులత

సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ పరిశోధన ప్రధాన శాస్త్రవేత్త మంజులత

ముకరంపుర, మే 24: మేలైన విత్తనంతోనే నాణ్యమైన దిగుబడి సాధించవచ్చని కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త మంజులత రైతులకు సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్‌లోని పరిశోధన స్థానంలో విత్తన మేళా, ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మంజులత మాట్లాడుతూ, ఏటా వానకాలం, యాసంగి సీజన్లలో విత్తనోత్పత్తి చేసి మేలురకాలను రైతులకు అందించేలా వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారని తెలిపారు. కరీంనగర్ నుంచి విడుదలైన విత్తనాలు కరీంనగర్ మక్క-1, వరంగల్ కంది-2 (డబ్ల్యు.ఆర్.జి. 255), యాదాద్రి (డబ్ల్యు.జి.జి.42), జగిత్యాల తిల్-1 (జె.సి.ఎస్. 1020) నువ్వుల రకాల ప్రత్యేకతను రైతులకు తెలియజేశారు. ఈ విత్తనాలను రైతులకు విక్రయించేందుకు అందుబాటులో ఉంచామని చెప్పారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ, పచ్చిరొట్ట సాగుకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. రైతులు పంట అవశేషాలైన వరి కొయ్యలను తగలబెట్టవద్దని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ పరిశోధనా స్థానాల్లో అభివృద్ధి చేసిన నాణ్యమైన విత్తనాలను సాగు చేసి అధిక దిగుబడులు పొందాలని రైతులను కోరారు. శాస్త్రవేత్తలు శ్రావణి, ఉషారాణి వానకాలంలో సాగు చేసే పంటలకు అనువైన రకాలు, సీనియర్ శాస్త్రవేత్త విజయ భాస్కర్ విత్తన శుద్ధి ప్రాముఖ్యత, విత్తనశుద్ధి విధానాన్ని వివరించారు. మరో శాస్త్రవేత్త మధుకర్ రావు చిరుధాన్యాల సాగు విధానాన్ని తెలిపారు. ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ మదన్ మోహన్ రెడ్డి, శాస్త్రవేత్త రాజేంద్ర ప్రసాద్ అధిక సాంద్రత, పత్తి సాగులో మెళకువలు, సాగు విధానం, వానకాలంలో పంటల్లో వచ్చే చీడ పీడల నివారణ, యాజమాన్యం, ముందస్తు జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆత్మ పీడీ ప్రియదర్శిని మాట్లాడుతూ, రైతులు పంట మార్పిడి విధానాన్ని పాటిస్తూ, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలని సూచించారు. విత్తన అభివృద్ధి సంస్థ అధికారి శ్రీనివాస్, ప్రస్తుతం సంస్థలో అందుబాటులో ఉన్న విత్తనాలు, వాటి ధరలను రైతులకు తెలియజేయగా, విత్తన ధ్రువీకరణ అధికారి కీర్తన, విత్తన ధృవీకరణ సంస్థ ఉద్దేశం, సంస్థ కార్యక్రమాలను కర్షకులకు వివరించారు. కార్యక్రమంలో ఏవోలు, ఏఈవోలు, ఉత్తమ రైతులు, రైతు ఉత్పత్తి దారుల సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

పని ఒకచోట.. వేతనం మరోచోట

- జిల్లా యువజన, క్రీడాశాఖలో ఇష్టారాజ్యం

డీఎస్‌ఏ కార్యాలయం

కొత్తపల్లి, మే 24: జిల్లా యువజన క్రీడాశాఖలో ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో నిధులను పక్కదారిపట్టిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం అంబేద్కర్ స్టేడియం, స్విమ్మింగ్‌పూల్, వేసవి క్యాంపులకు వేర్వేరుగా నిధులు మంజూరు చేస్తది.

ఆయా విభాగాల్లో పనిచేసే సిబ్బందికి ఆయా నిధుల నుంచే వేతనాలు ఇస్తారు. అయితే అంబేద్కర్ స్టేడియంలో కొన్నేండ్లుగా నైట్‌వాచ్‌మెన్‌గా పనిచేసిన రామస్వామిని ఏడాది కిందట అప్పటి డీవైఎస్‌వో రాజవీరు ఆదేశాల మేరకు స్పోర్ట్స్ స్కూల్ వాచ్‌మెన్‌గా నియమించారు. అయితే వేతనం మాత్రం అంబేద్కర్ స్టేడియానికి కేటాయించిన నిధుల నుంచే చెల్లిస్తున్నారు. అలాగే స్పోర్ట్స్ స్కూల్‌లో నైట్ వాచ్‌మెన్ వెంకటస్వామిని అంబేద్కర్ స్టేడియం వాచ్‌మెన్‌గా నియమించారు. వేతనం మాత్రం స్పోర్ట్స్‌స్కూల్ నిధుల నుంచి, స్విమ్మింగ్ పూల్‌లో కోచింగ్ హెల్పర్‌గా ఉన్న విష్ణుకు పనిచేయకున్నా వేతనం ఇస్తున్నట్లు ఆరోపణలున్నాయి. స్విమ్మింగ్ శిక్షణ ద్వారా వచ్చే ఆదాయాన్ని ఓ ఉద్యోగి సొంతానికి వాడుకోగా ఉన్నతాధికారులు మందలించినట్లు సమాచారం.

షోకాజ్ నోటీసులు ఇచ్చా

నేను ఎన్నికల బదిలీల్లో ఇక్కడికి వచ్చా. ఉద్యోగులు పనిచేసేది ఒకచోట, జీతం తీసుకొనేది మరోచోట అని తెలిసినప్పుడే సంబంధిత ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేసిన. స్విమ్మింగ్ పూల్ ఆదాయాన్ని సంస్థ బ్యాంక్ ఖాతాలో జమ చేయకపోవడంతో బాధ్యుడైన ఉద్యోగిని మందలించిన. ఇలాంటి వ్యవహారాలు మా దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటం.

-డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

కమాన్‌చౌరస్తా, మే 24 : జిల్లా వ్యాప్తంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం నిర్వహించిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు మొత్తం 2902 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 2662 మంది హాజరయ్యారు. 240 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం రెండో సంవత్సరం పరీక్షకు 1189 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 1104 మంది హాజరయ్యారు. 85 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు వెల్లడించారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

కరీంనగర్ రూరల్, మే 24: నగునూర్‌లో రోడ్డు ఎఫెక్టెడ్ ఏరియా ఆక్రమించి చేపట్టిన భవనం ప్రహరీని శుక్రవారం గ్రామపంచాయతీ కార్యదర్శి మల్లయ్య, సిబ్బందితో వెళ్లి కూల్చివేయించారు. అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని పలుమార్లు నోటీసులు ఇచ్చినప్పటికీ సదరు భవన యజమాని నుంచి స్పందన లేకపోవడంతో ప్రహరీని కూల్చివేయించామని కార్యదర్శి తెలిపారు. కాగా, కూల్చివేత పనులపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కొందరు పంచాయతీ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు.

ఇవి నల్లా నీళ్లే!

చొప్పదండిలోని పాత వాటర్ ట్యాంక్ నుంచి వచ్చిన రంగు మారిన నీరు

చొప్పదండి మున్సిపాలిటీలోని పాత వాటర్ ట్యాంక్, ఎంఈవో ఆఫీస్ సమీపంలోని వాటర్ ట్యాంకు నుంచి ఇండ్లకు సరఫరా చేస్తున్న నల్లా నీరు మురుగు నీటి కంటే అధ్వానంగా ఉంటున్నది. కొద్ది రోజుల నుంచి ఇండ్లకు సరఫరా చేసే కొద్దిపాటి నీళ్లు మట్టితో కలుషితమై, రంగు మారి దుర్వాసన వస్తున్నాయి. మురికిగా వస్తున్న ఈ నల్లా నీటిని తాగడానికే కాదు.. కనీసం స్నానాలకు ఇతర అవసరాలకు కూడా వినియోగించుకోలేకపోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

-చొప్పదండి, మే 24